క్లుప్తంగా

చెక్కు అందజేత



మల్హర్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన తాడవెని ఉషారాణికి రూ.48,000 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్‌ల ఆదేశాల మేరకు లబ్ధిదారునికి మంగళవారం అందజేసినట్లు రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రాము, నాయకులు పురోషత్తం, సమ్మయ్య, మధు, రవి, లక్ష్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మండల సభ వాయిదా



చిట్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంళవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం మండల ప్రాదేశిక సభ్యులు(కోరం) రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి తెలిపారు. ఈ సమావేశాన్ని త్వరలోనే నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీఓ రామయ్య, డీటీ శివతేజ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుకుమార్, ఏఈ అనిల్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి సునీల్, సబ్ ఇంజనీర్ వెంకట సంజయ్, వెటర్నరీ డాక్టర్ మహతి, ఏఈఓ రమణ కుమార్, సందీప్, సర్పంచ్‌లు రత్నాకర్‌రెడ్డి, నారాయణరావు, వెంకటేష్, జవహర్ లాల్, గజ్జి రవి పాల్గొన్నారు.

పరామర్శ



చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన మిర్యాల రాకేష్ రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం చిట్యాల సివిల్ ఆస్పత్రి వద్ద పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మండల నాయకులు ఉన్నారు.

బియ్యం అందజేత



మహాముత్తారం: మండలంలోని కనుకునూర్ గ్రామానికి చెందిన కాక చిన్నన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేట, పోతుగల్లు గ్రామాలకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్సిపేట, పోతుగల్లు గ్రామాలకు చెందిన ఎట్టేపు రాజు, కాశినేని అరుణ వ్యవసాయ భూముల వద్ద నిర్లక్ష్యంగా వరిగడ్డిని తగలపెట్టడంతో పక్క రైతులైన ఎట్టేపు భూమారావు, గాజుల మొగిలిలకు సంబంధించిన పైపులు, మోటార్లు కాలిపోయినట్లు తెలిపారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు రాజు, అరుణపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

జ్వరంతో యువకుడి మృతి



అవినాష్(ఫైల్)

మహాముత్తారం: మండలంలోని ప్రేమ్‌నగర్ గ్రామానికి చెందిన జాటోత్ అవినాష్(30) యువకుడు జ్వరంతో మృతి చెందాడు. కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజులుగా జ్వరం రావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. యువకుడు మృతిచెందడంతో విషాదఛాయలు గ్రామంలో నెలకొన్నాయి.

5వేల మందితో యువ నేతాజీ ఫౌండేషన్



వరంగల్ నగరానికి చెందిన యువ నేతాజీ ఫౌండేషన్ రక్తదానం ప్రాధాన్యతను తెలుపుతూ.. ఆపదలో ఉన్న వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ముందుకు సాగుతోంది. ఈ ఫౌండేషన్‌కు కొత్తకొండ అరుణ్‌కుమార్ అధ్యక్షుడిగా కొనసాగుతుండగా ఇందులో 5వేల మంది సభ్యులుగా ఉన్నారు. ఇప్పటివరకు 35వరకు క్యాంపులు నిర్వహించి రక్తం సేకరించి తలసేమియా బాధిత పిల్లలకు రక్తం అందించారు. వీరి సేవలకుగాను మూడు అవార్డులు కూడా వచ్చాయి. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతులమీదుగా బెస్ట్ బ్లడ్ మోటివేటర్ అవార్డు కూడా అందుకున్నారు. వీరి ఫౌండేషన్ నిర్వహణలో 25 వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటుచేసి ఆపదలో ఉన్న వారికి అవసరమైన రక్తం అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. బుధవారం ఎంజీఎం బ్లడ్‌సెంటర్‌లో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు.

రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం..



ఆయన వృత్తి పోలీస్ కానిస్టేబుల్.. ప్రవృత్తి రక్తదానం.. దాతలను ప్రోత్సహించడం. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె రాజు (స్విమ్మర్ రాజు) కాలేజీ రోజులనుంచి రక్తదానం చేస్తున్నారు. 2005నుంచి ఇప్పటివరకు 31సార్లు (ఓ పాజిటివ్) రక్తదానం చేశారు. ఇప్పుడు నేతాజీ ఫౌండేషన్‌లో బ్లడ్ మోటివేటర్‌గా పనిచేస్తూ ఎంతోమందికి రక్తదానంపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల ద్వారా 85,000 మందికిపైగా యువతకు అవగాహన కల్పించారు.

రక్తదానంలో రా'రాజు'



జనగామ పట్టణం ధర్మకంచకు చెందిన మల్లిగారి రాజు ఇప్పటివరకు 86 సార్లు రక్తదానం చేసి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. 1997లో తన మేనమామ ఇర్సం కిషన్ రైలు ప్రమాదంలో చేయి పోగొట్టుకొని అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో లేక చనిపోయాడు. దీంతో కలత చెందిన రాజు మరొకరికి ఇలాంటి పరిస్థితి రావొద్దని నాటిమంచి నేటి వరకు ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేస్తూ, పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వరంగల్, హైదరాబాద్ ఇలా ఎక్కడికి వెళ్లినా సొంత డబ్బులు ఖర్చు చేసుకొని రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకున్నారు.

ఈ ఏడాది నినాదం ఏమిటంటే.. | నేడు (14 జూన్ 2023న) జరుపుకునే ప్రపంచ రక్తదాతల దినోత్సవ ప్రచార నినాదం | ‘రక్తం ఇవ్వండి.. ప్లాస్మా ఇవ్వండి.. జీవితాన్ని పంచుకోండి.. తరచూ పంచుకోండి.’ | ..ఇది ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది.

రక్తం ఇవ్వండి.. జీవితాన్ని పంచుకోండి



- రక్తదాన ప్రాధాన్యతను గుర్తుచేసిన బాలాసోర్ రైలు ప్రమాదం
- స్వచ్ఛందంగా తరలివచ్చిన యువకులు, గ్రామస్తులు
- ఇదే స్ఫూర్తితో ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది రక్తదాతలు
- సామాజిక మాధ్యమాల ద్వారా సమాచార మార్పిడి
- నేడు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

వరంగల్ డెస్క్: రక్తదానం.. ప్రాణదానం ఒక్కటే. ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకునేది రక్తం ఒక్కటే. ఏదైనా ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తక్షణ అవసరం రక్తం. అదే సకాలంలో అందితే మనిషి ప్రాణాపాయంనుంచి బయటపడతాడు. ఏ మాత్రం ఆలస్యం చేసినా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఇక.. రక్తమార్పిడిపై ఆధారపడిన రోగుల జీవన నాణ్యతను మార్చేది సురక్షితమైన రక్తం. ఇలాంటి వారికి సహాయపడడానికి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు క్రమంతప్పకుండా.. సురక్షితంగా.. సాధ్యమైనప్పుడల్లా రక్తదానం చేయొచ్చు. రక్తదానంపై ఉన్న ఎన్నో అపోహలను తొలగించేందుకు అనేక స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం, వైద్యారోగ్యశాఖలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. చాలామంది ఔత్సాహికులు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ తమ ఉదారతను చాటుకుంటున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదులసార్లు రక్తదానం చేసిన, ఇతరులను ప్రోత్సహిస్తున్న దాతలపై ప్రత్యేక కథనం.

బాలాసోర్ రైలు ఘటనలో...



ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ జిల్లా బాలాసోర్ వద్ద ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదంలో వందలాది మంది ప్రయాణికులు తీవ్ర రక్తస్రావాన్ని చవిచూసిన నేపథ్యంలో రక్తకొరత తీర్చేందుకు స్థానికులు, సమీప ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా ఆస్పత్రులకు తరలివచ్చి రక్తదానం చేశారు. దీనికి సంబంధించి అక్కడి అధికారిక వర్గాల ప్రకారం.. బాలాసోర్, భద్రక్, కటక్‌లలో 3,000 మందికి పైగా రక్తదానం చేశారు. దీంతో చాలామంది క్షతగాత్రులకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని సమాజం అభినందనలతో ముంచెత్తింది. ఆపద వచ్చినప్పుడు ఇలాంటి స్ఫూర్తి మనందరిలో కలగాల్సిన అవసరం ఉంది.

అరుదైన ఓ నెగెటివ్ బ్లడ్ దాత



గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జి.జయరాజుది ఓ నెగెటివ్ బ్లడ్ గ్రూప్. ఇది చాలా అరుదు. 1990లో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ బహిరంగ సభ ఉండగా ఆయన బ్లడ్ గ్రూపు ఓ నెగెటివ్ కలిగిన జయరాజును ముందు జాగ్రత్తగా వేదిక పక్కన అంబులెన్స్‌లో సిద్ధంగా ఉంచారు. తన 34 ఏళ్ల సర్వీసులో 32 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

విష్ణువర్ధన్ @ 30 సార్లు



మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన పానుగంటి విష్ణువర్ధన్ ఇప్పటివరకు 30సార్లు రక్తదానం చేశారు. ఓ పాజిటివ్ గ్రూప్ గల విష్ణువర్ధన్ ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలు కాపాడడంలో తనవంతు సాయం అందించారు. కాలేజీ చదివే రోజుల్లో మొదటిసారి రక్తదానం చేసిన విష్ణువర్ధన్.. ఇప్పటివరకు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం ముందుకు సాగుతున్నారు. రక్తం అవసరమైన వారు సమాచారం అందిస్తే తక్షణమే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని విష్ణు 'సాక్షి'తో తెలిపారు.

ప్రదీప్ @ 42సార్లు



భూపాలపల్లి మండలం దూదేకులపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి ప్రదీప్ 2006 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 42 సార్లు రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారు ఫోన్ చేస్తే చాలు ఎంతదూరమైనా వెళ్లి రక్తం ఇచ్చి వస్తుంటారు. దీంతోపాటు వివిధ సందర్భాల్లో ఏర్పాటుచేసే రక్తదాన శిబిరాల్లో స్వచ్ఛందంగా వెళ్లి రక్తదానం చేస్తుంటారు. తలసేమియా బాధితులకు రక్తం ఎంతో అవసరమని, తనది వారికి ఉపయోగపడితే ఎంతో సంతోషంగా ఉంటుందని ప్రదీప్ తెలుపుతున్నారు.

సతీష్‌రెడ్డి @ 66సార్లు



టేకుమట్ల మండలం జడల్‌పేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కామిడి సతీష్‌రెడ్డి 66 సార్లు రక్తదానం చేశారు. 2015లో అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రక్తదానంపై యువత ఎలాంటి అపోహలకు లోను కాకుండా ముందుకు రావాలని సతీష్‌రెడ్డి కోరుతున్నారు.

గడ్డికి నిప్పు.. పర్యావరణానికి ముప్పు



పొలంలోని గడ్డికి నిప్పు అంటించిన రైతులు



నర్సింగాపూర్ గ్రామ శివారులోని పొలాల్లో వ్యాపిస్తున్న పొగలు

- అవగాహన లేక అంటుపెడుతున్న అన్నదాతలు
- గ్రామాల్లోకి వ్యాపిస్తున్న మంటలు

మహాముత్తారం: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు కూలీల సహాయంతో వరిపంటలను కోసి ఎడ్లబండ్ల ద్వారా తమ కల్లాల్లోకి చేర్చేవారు. అనంతరం కూలీల ద్వారా కాడెద్దుల సహాయంతో బంతికొట్టి ధాన్యాన్ని, గడ్డిని వేరు చేసేవారు. కాని ఇప్పుడు మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రస్తుతం ప్రతి ఒక్కరూ వరిని కోయడానికి యంత్రాలను వినియోగిస్తున్నారు. దీంతో వేగంగా పంటలు కోయడంతో పాటు గడ్డిని అవసరం ఉన్న రైతులు మాత్రమె గడ్డిని ఇంటికి తీసుకువెళ్తున్నారు. మిగిలిన వారు వరిగడ్డికి నిప్పుపెట్టి పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు. అలాగే మంటలు మండుతున్న సమయంలో మిగిలిన వరిగడ్డితో పాటు కొయ్యకాళ్లు కాలుతూ గ్రామాల పొలిమేరకు మంటలు వ్యాపించి ఎండవేడిమి తీవ్రంగా గ్రామంలోకి వ్యాపించిన సంఘటనలు కూడా ఉన్నాయి.

పర్యావరణానికి ప్రమాదం

వరిగడ్డికి నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తునపొగ మంటలు వ్యాప్తి చెందితే గ్రామీణ వాతావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. పొలాల్లోని గడ్డికి ఎప్పుడు నిప్పు పెట్ట కూడదని రైతులకు వ్యవసాయశాఖ అధికారులు చేస్తున్న విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదు. ఈ మంటల వల్ల పెద్ద ఎత్తున కార్బన్‌డయాక్సైడ్ విడుదలై తీవ్రస్థాయిలో కాలుష్యం చేస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

పశుగ్రాసం కొరత..

వరిపంటల కోతలు పూర్తి అయిన అనంతరం పశువులకు ఏడాది సరిపడ వరిగడ్డిని వాముల రూపంలో నిల్వ చేసుకొని పశువులకు ఆహారంగా వినియోగించేవారు. అయితే ఇప్పుడు యంత్రాల ద్వారా వరికోయడంతో పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతుంది. ఒకప్పుడు గ్రామాల్లో ఉచితంగా లభించే గడ్డి నేడు అత్యంత కరీదుగా మారిపోయింది. ఒకప్పుడు ఒక గడ్డి పంజకు రూ.2 నుండిచి రూ.5 ఉండగా నేడు రూ.50 నుంచి రూ.80 వరకు ధర పలుకుతుంది. పశుగ్రాసం కొరతతో పశువులను సాదుకునేందుకు పలువురు రైతులు ఆసక్తి చూపడం లేదు.

> **అవగాహన కల్పిస్తున్నాం..**
>
> పొలాల్లో గడ్డితోపాటు కొయ్యకాళ్లకు నిప్పు పెట్టకుంగా మండలంలోని రైతులకు అవగాహన కల్పిస్తుంన్నాం. గడ్డికి నిప్పు పెట్టడం వల్ల జరిగే నష్టాన్ని వివరిస్తున్నాం. అయినప్పటికీ కొంతమంది రైతులు వరి గడ్డిని తగులబెడుతున్నారు.
>
> –సతీష్, మండల వ్యవసాయ అధికారి, మహాముత్తారం

పాఠ్యపుస్తకాల పంపిణీ



కాటారం: పుస్తకాలు పంపిణీ చేస్తున్న సుదర్శన్



మహదేవపూర్: పంపిణీ చేస్తున్న ఎంపీపీ

కాటారం: ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పుస్తకాల పంపిణీ మంగళవారం ప్రారంభమైంది. ఇటీవల మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి పాఠ్య పుస్తకాలు చేరుకోగా మండలంలోని పలు పాఠశాలలకు పుస్తకాలను చేరవేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా పాఠశాలలకు పుస్తకాలను అందజేస్తున్నట్లు ఎంఐఎస్ కోఆర్డినేటర్ గద్దల సుదర్శన్ తెలిపారు. మండలంలో సుమారు 13000 పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలను ఎంపీపీ రాణీబాయి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరుణ, సర్పంచ్ శ్రీపతబాపు, ప్రధానోపాధాయుడు సతీష్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



టేకుమట్ల: ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

టేకుమట్ల: మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్ అన్నారు. ఇసుక అక్రమ రవాణాపై నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలివాగు, మానేరుపై ఎంతో మంది రైతులు ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. కానీ ఇసుక క్వారీ పేరుతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ కాంట్రాక్టర్ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇసుక అక్రమ రవాణా వలన వ్యవసాయం చేసుకుంటున్న రైతులు సైతం కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, శాస్త్రాల కిరణ్, నాంపెల్లి వీరేశం, సదానందం, కుమార్ పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని నవాబుపేట చలివాగు, కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ముకిరాల మధువంశీకృష్ణ అధికారులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు ఇసుక అక్రమ రవాణాను కొనసాగిస్తున్న రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరిమితికి మించి ఓవర్ లోడ్‌తో ఇసుక లారీలు వెళ్తుండడంతో రోడ్లు మొత్తం దెబ్బతింటున్నాయని అన్నారు. ఇప్పటికైనా ఇసుక రవాణా దందాను అరికట్టాలని, చిట్యాల మండలంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దబ్బెట అనిల్, నాయకులు లక్ష్మణ్, అమ్మద్ పాషా, నరేష్ పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న మధువంశీకృష్ణ

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు ఓనపాకల రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని రామకిష్టాపూర్(టి)లో బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, బట్టలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమంలో పాఠశాల ఎన్నికైందని దాంతో గ్రీన్ బోర్డు, డ్యూయల్ డెస్క్ బెంచ్‌లు, స్మార్ట్ టీవీ అందుబాటులో ఉందన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పల్లెప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి

పలిమెల: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి పల్లెప్రగతి కార్యక్రమంలో చేయాల్సిన పనులపై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే హరితహారంలో భాగంగా ప్రతి గ్రామంలో వేయి మొక్కలు నాటాలే స్థలాలు ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బుర్ర సునీత, ఈసీ శ్రీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రశాంత్, సాంబశివుడు, సీఓ షారుఖ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి సల్మాన్ పాల్గొన్నారు.